‘ఆసరా’తో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 5483 సంఘాలకు లబ్ధి
- రూ.37,44,78,271 రుణమాఫీ


డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్'.. 'జగనన్నే మా భవిష్యత్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే, తద్వారా కుటుంబం, ఆపై సమాజం బాగుంటుందని అన్నారు. అన్ని విధాలా మహిళలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు.

55,962 మందికి లబ్ధి

గాజువాక నియోజకవర్గం పరిధిలో 5483 సంఘాలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. మొత్తం 55,962 మంది సభ్యులు ఉన్నారని.. 37,44,78,271 రూపాయల రుణం మాఫీ చేశారని తెలియజేశారు. దీంతో మూడేళ్లలో మొత్తం 112,34,34,813 రూపాయల రుణాన్ని మాఫీ చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని పథకాల ద్వారా మహిళలకు లబ్ధి చేకూర్చనున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రుణ మాఫీ చెక్కును ఆయన అందజేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ సింహాచలం, ఏపీడీ సంతోష్‌కుమార్, డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, బొడ్డు నర్సింహపాత్రుడు, ఇల్లపు వరలక్ష్మి, ఉరుకూటి చందు, వార్డు ఇన్‌చార్జిలు ధర్మాల శ్రీను, కోమటి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, గుడివాడ లతీష్, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు కులుకూరి మంగరాజు, రాజాన వెంకటరావు, మహ్మద్ గౌస్, నాయకులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బిస్కెట్లు అందిస్తున్న హెచ్ఎం కాంతం

అక్కిరెడ్డిపాలెం: అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకుని శ్రీ మణికంఠ జ్యోతి భిక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సేవా సంఘం ప్రతినిధులు హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం చేతుల మీదుగా బిస్కెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం విశేషపూజలు, భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు చరపాక నాగార్జున రాజు, నంబారు రాజు, బొడ్డు చినఅప్పల స్వామి, టి.నూకినాయుడు, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన కంటైనర్ లారీ


డివైడర్ పైకి ఎక్కిన కంటైనర్ లారీ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం వద్ద కంటైనర్ లారీ డివైడర్ పైకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. స్థానికులు, గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి.. మంగళవారం వేకువజామున బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ నుంచి షీలానగర్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ నాతయ్యపాలెం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కేసింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఒక్కరే లారీలో ఉన్నాడని, అతని ఎటువంటి ప్రమాదం జరగలేదని వారు తెలిపారు. కొద్ది గంటల్లో పోలీసులు కంటైనర్ లారీని క్రేన్ సహాయంతో తొలగించారు.

పేదలకు సరకుల అందజేత


సరకులు, నగదు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ మూడు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, చెరో వెయ్యి రూపాయలు సహాయంగా అందించారు. ట్రస్ట్ డైరెక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు సహకారంతో బియ్యం, కందిపప్పు, నూనెలతో కొత్త వస్త్రాలు, వెయ్యి రూపాయల వంతున అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు గుడే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు ట్రస్ట్ ప్రతినిధిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సలహాదారు పట్టా రామ అప్పారావు, అధ్యక్ష, కార్యదర్శులు శీరంశెట్టి గోవిందరావు, కిడిమి హనుమంతురావు, పొన్నగంటి కొండలరావు పాల్గొన్నారు.

సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: ఈ నెల 15, 16 తేదీల్లో గాజువాకలో నిర్వహించనున్న సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్‌ను కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల నుంచి 200 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటున్న ఈ పోటీలను గాజువాకలో నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖలో ఉన్న బాడీ బిల్డర్లందరూ ఈ పోటీలను జయప్రదం చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆనంద్ కుమార్, సురేష్ రెడ్డి, ఢిల్లీ సనపల తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటం భావితరాలకు మార్గదర్శకం


శిబిరంలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు కర్మాగార పరిరక్షణకు కార్మికులు చేస్తున్న పోరాటం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 782వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు గత వారం ఢిల్లీలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులను కలిశామని, ఉక్కు పరిరక్షణకు సహకరించాలని విన్నవించామని తెలిపారు. ఉక్కు పరిరక్షణకు భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 10వ తేదీన ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కూర్మన్నపాలెంలో టెంట్ వద్దకు వస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీన పాదయాత్ర ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 25న సీఎండీ బంగ్లాను ముట్టడిస్తామని, ఈ కార్యక్రమాల్లో కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలుకు డిమాండ్


ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం చేయాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో స్టీల్ మెల్ట్ షాప్ విభాగాధిపతి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవోఐను కార్మికవర్గం ఐక్యంగా వ్యతిరేకించాలని కోరారు. అనంతరం విభాగాధిపతి పి. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, కర్రా ప్రకాశ్, బి. అప్పారావు, మరిడయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


పాల్‌కిరణ్

గాజువాక: గాజువాక తహసీల్దార్‌గా ఎం.పాల్ కిరణ్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. విశాఖ కలెక్టర్ కార్యాలయంలోని సెక్షన్ కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన సుజాత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎఫ్ సెక్షన్‌కు ఇటీవల బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ కొన్న త్రినాథరావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు.

భూ కబ్జాలపై ఉక్కుపాదం


యాతపాలెంలో రెవెన్యూ సిబ్బంది తొలగించిన షెడ్డు

పెదగంట్యాడ: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని మండల తహసీల్దార్ కె.రమాదేవి హెచ్చరించారు. మండలంలోని యాతపాలెంలో సర్వే నెంబర్ 274లోని కొండపోరంబోకు భూమిలో కొండను తవ్వి సుమారు 200 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించి, అందులో షెడ్డు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ స్పందించారు. ఆర్ఐ వై.సందీప్ సిబ్బందితో కలసి ఆ షెడ్డును మంగళవారం తొలగించారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. మండలంలోని కొండలు గానీ, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు.

‘జగనన్నే మన భవిష్యత్’ .. నినాదంతో ప్రజల్లోకి


సమావేశంలో ప్రసంగిస్తున్న పల్లా చినతల్లి

గాజువాక: జగనన్నే మన భవిష్యత్ నినాదంతో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజల్లోకి వెళ్లాలని డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి కోరారు. 67వ వార్డు సాయిరామ్ నగర్, జోగవానిపాలెం, కృష్ణానగర్, అశోక్‌నగర్, పెంటయ్యనగర్, గణేష్‌నగర్ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదల కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి అందిన ప్రతీ దరఖాస్తుకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 72వ వార్డులో సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం ఆయన కలుసుకున్నారు. పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందుతాయని, ఈ విషయంలో ప్రభుత్వానికి అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, వాసవి నాయుడు, మధు, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, నాగమణి, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల వితరణ


సరకులను అందిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలోని ఉడపాల వీధిలో ఓ నిరుపేద కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. కొద్ది రోజులుగా క్యాన్సర్‌తో బాధ పడుతూ, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మోహన్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్పు శేషు ఆర్థికసాయంతో నిత్యావసర సరకులను అందించారు. వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల చేతుల మీదుగా మంగళవారం వాటిని అందజేశారు.

కల్యాణ మండపాల వేలం వాయిదా


వేలం నిర్వహిస్తున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని కల్యాణ మండపాల వేలం పాట వాయిదా పడింది. 70వ వార్డులోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపం, 77వ వార్డు దేశపాత్రునిపాలెంలో గల జీవీఎంసీ కల్యాణ మండపం నిర్వహణకు జోనల్ అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపం నిర్వహణకు ఏడాదికి రూ.7.51లక్షల కనీస లీజుగా, దేశపాత్రునిపాలెం కల్యాణ మండపానికి ఏడాదికి రూ.7 లక్షల కనీస లీజుగా నిర్ణయించారు. లీజుపై ఏటా రూ.10 శాతం పెంచడంతో పాటు పాడుకున్న లీజు మొత్తానికి 18 శాతం జీఎస్టీ, కల్యాణ మండపాల్లో ఖాళీ స్థలాలకు 4 శాతం పన్ను చెల్లించే విధంగా నిబంధన విధించారు. దీంతో పాటదారులు ముందుకు రాలేదు. కొద్దిసేపు నిరీక్షించిన జోనల్ కమిషనర్ వేలంపాటను బుధవారానికి వాయిదా వేసినట్టు ప్రకటించారు. కార్యక్రమంలో జోనల్ రెవెన్యూ అధికారి సీహెచ్.రామనారాయణ, సూపరింటెండెంట్ కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

‘వాయిస్ ఆఫ్ గాజువాక’కు స్థలం కోసం వినతి

గాజువాక: గాజువాకలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాయిస్ ఆఫ్ గాజువాక, వరిష్ట పౌరుల సమాఖ్యలకు సొంత వసతి కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆ సంస్థల సభ్యులు కోరారు. ఈ మేరకు ఆ సంఘాల నాయకులు టీవీ నాగేశ్వరరావు, ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు కలెక్టర్ మల్లికార్జునను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తమ సంస్థల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నా, సొంత వసతి లేక ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ఈ విషయంలో గత జిల్లా కలెక్టర్ హామీ కూడా ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌ను కలిసి ఇదే అంశంపై వినతి పత్రం అందజేశారు.

వ్యక్తి అదృశ్యం


రాజు నాయుడు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: మానసిక పరిస్థితి సరిగ్గా లేని వ్యక్తి మందులు తెచ్చుకుంటానని వెళ్లి అదృశ్యమైన ఘటన గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రైవేట్ పనులు చేసుకునే మెరుగ రాజు నాయుడు (55) భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలతో 68వ వార్డు మిందీ రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. మూడు నెలలుగా ఆయన మానసిక పరిస్థితి సరిగ్గా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 1వ తేదీన రాజు నాయుడు మందులు తెచ్చుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారని, అప్పటి నుంచి తిరిగిరాలేదని పేర్కొన్నారు. రాజు నాయుడు భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటనున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే, గాజువాక పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని సూచించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న దేవన్‌రెడ్డి

గాజువాక: జీవీఎంసీ 72వ వార్డు కర్ణవానిపాలెం సచివాలయం పరిధిలో మంజూరైన పింఛన్లను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలుసుకుని, పింఛన్లను అందజేశారు. అర్హులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు మధుసూదన్‌రెడ్డి, వాసవి నాయుడు, మధు, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, నాగమణి, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో దివ్యాంగుడు సూరిబాబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అక్కిరెడ్డిపాలెం: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఇద్దరు లబ్ధిదారులకు వార్డు వలంటీర్, సచివాలయ కన్వీనర్ ఆయా ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందించారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన దివ్యాంగుడు గంధం సూరిబాబుకు, గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వితంతువు యర్రా ఈశ్వరికి వలంటీర్ టి.సత్య, సచివాలయ కన్వీనర్ నేలపాటి సత్యవతి మంగళవారం పింఛన్లు అందజేశారు. లేవలేని స్థితిలో ఉన్న తమ వద్దకే వచ్చి పింఛన్ అందించడంతో, లబ్ధిదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చలో ఢిల్లీకి తరలిన సీఐటీయూ శ్రేణులు



ఢిల్లీకి బయల్దేరుతున్న స్టీల్ సీఐటీయూ కార్యకర్తలు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ శ్రేణులు చలో ఢిల్లీకి తరలి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా బుధవారం ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం తలపెట్టాయి. ఇందులో భాగంగా సీఐటీయూ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు బయల్దేరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అటు కార్మికులను, ఇటు కర్షకులను నట్టేట ముంచుతోందన్నారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని కుట్ర చేస్తోందన్నారు. కేంద్రం వైఖరికి వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎం. శ్రీనివాస్, యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా వార్డు అభివృద్ధి


కార్పొరేటర్ వరలక్ష్మిని సత్కరిస్తున్న అఖిల పక్షాల నాయకులు

అగనంపూడి: రాజకీయాలకు అతీతంగా వార్డు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. కార్పొరేటర్‌గా ఎన్నికై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వార్డులోని ప్రజా సంఘాలు ఆమెను సత్కరించాయి. ఆమె మాట్లాడుతూ ప్రజల మన్ననలతో ఎన్నికయ్యానని, వారి ఆశీస్సులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎంపీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరికుమారి సహకారంతో వార్డులో అవసరం మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, నాయకులు తోకాడ రాము, కిమిడి హనుమంతురావు, బలిరెడ్డి సత్యనారాయణ, ఐలా రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొర్రమాంబ జాతర


పూజలందుకున్న బొర్రమాంబ అమ్మవారు

అగనంపూడి: ఎనిమిది గ్రామాల ఇలవేల్పు బొర్రమాంబ అమ్మవారి జాతరను మంగళవారం వైభవంగా జరిపించారు. అగనంపూడి నిర్వాసిత కాలనీలు, పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి చీర, సారె, గాజులు సమర్పించి, మొక్కులు చెల్లించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి వనానికి తరలివచ్చి పసుపు, కుంకుమలు సమర్పించారు.


అమ్మవారి దర్శనం కోసం వేచియున్న భక్తులు

జాతర సందర్భంగా సోమవారం రాత్రి కోటి దీపాల ఉత్సవం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నిర్వాసిత కాలనీల్లో బళ్ల వేషాలు, నేల వేషాలు, తప్పెటగుళ్లు, సాము గరిడీలు, కోయ డాన్స్‌లు, కోలాటంతో అమ్మవారిని భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారి వనం నుంచి గ్రామం వరకు విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో వివిధ పక్షాలకు చెందిన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సర్వజన మనోరంజనిపై అప్పన్న తిరువీధి


సర్వజన మనోరంజనిపై తిరువీధిలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా మనోరంజని వాహనంపై అధిష్టింపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, కుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారిణుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


పూజలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.